

## నేడు రామయ్య కల్యాణం

3

జిల్లావ్యాప్తంగా రామాలయాలు ముస్తాబు రామాజీపేట ఆలయం మరింత ప్రసిద్ధి నలుమూలల నుండి రానున్న భక్తులు

TELANGANA CAPITAL సంపుటి 01 | సంచిక 08

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

కాంప్లిమెంటరీ కాపీ | కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల | బుధవారం 17 ఏప్రిల్ 2024 | పేజీలు 5



స్వపక్షమా..? విపక్షమా..?

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే మద్దతు

వరుసగా ప్రభుత్వంపై విమర్శల దాడి

అర్థం కాని కామ్రేడ్ల స్ట్రాటజీ

# కమ్యూనిస్టులు.. ఎటువైపు..?

2

## పార్లమెంట్ ఎన్నికల వేళ పార్టీలో కన్ఫ్యూజన్

(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)

ఉద్యమాలకు కేరాఫ్ కామ్రేడ్లు. తెలంగాణ సాయుధ పోరును ముందుండి నడిపిన ఘనమైన చరిత్ర వారిది. అయితే.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్న ఎర్రదండు.. పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేకపోతోంది. ఇప్పటికే షెడ్యూల్ రిలీజ్ అయి.. మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ సైతం వెలువడనుంది. కానీ.. కమ్యూనిస్టులు మాత్రం తాము ఎవరివైపు అనేది ఇంతవరకు స్పష్టతనివ్వలేదు. దాంతో ఆ పార్టీ కార్యకర్తల్లోనూ కన్ఫ్యూజన్ కనిపిస్తోంది. దీనికితోడు సమయం దొరికినప్పుడల్లా జిల్లా సీపీఐ, సీపీఎం నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడుతూనే ఉన్నారు. దాంతో అసలు వీరు కాంగ్రెస్‌తోనే పొత్తులో ఉన్నారా..? లేక విడిపోయారా..? అనే సందిగ్ధం నెలకొంది. అటు జాతీయ స్థాయిలోనూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజ భార్య పోటీకి దిగుతున్నారు. వీటన్నింటి నేపథ్యంలో సీపీఐ నేతలు ఎలాంటి స్ట్రాటజీ తీసుకుంటారా అనేది తెలియకుండా ఉంది. కాంగ్రెస్‌కు పొత్తు ప్రకటిస్తారా..? లేదంటే ఇండిపెండెంట్‌గా తమకు అనుకూలమైన సీట్లలో బరిలోకి దిగుతారా వేచి చూడాలి.

# పేద కుటుంబంలో పుట్టి.. సివిల్స్ కొట్టి..

వెలిచాల యువకుడి ప్రతిభ

యూపీఎస్సీలో 27వ ర్యాంకు

కష్టాలు వెంటాడుతున్నా వెనకడుగు వేయని వైనం



ఓ వైపు ఫ్యామిలీని వెంటాడుతున్న కష్టాలు.. మరోవైపు సివిల్స్ సాధించాలని గోల్.. లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగాడు. ఫైనల్‌గా సివిల్స్ సాధించాడు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల కాంతయ్య-లక్ష్మీల కొడుకు సాయికిరణ్. తండ్రి మరణించినా తల్లి కష్టపడి తన పిల్లల్ని చదివించింది. తల్లి నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా.. కష్టపడి చదివి యూపీఎస్సీలో 27వ ర్యాంకు సాధించాడు. సాయికిరణ్ తన రెండో ప్రయత్నంలోనే సివిల్స్ సాధించడం విశేషం.

3



2

నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు మూడంచెల పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేపట్టినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పెద్దపల్లి డీసీపీ చేతనతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్స్ ప్రక్రియ పరిశీలించారు.

GENERAL NEWS

# కమ్యూనిస్టులు ఎటువైపు..?

**స్వపక్షమా..? విపక్షమా..?**

**అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే మద్దతు**

**వరుసగా ప్రభుత్వంపై విమర్శల దాడి**

**అర్థం కాని కామ్రేడ్ల స్ట్రాటజీం**

**పార్లమెంట్ ఎన్నికల వేళ పార్టీలో కన్ఫ్యూజన్**

**(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)**



ఉద్యమాలకు కేరాఫ్ కామ్రేడ్లు. తెలంగాణ సాయుధ పోరును ముందుండి నడిపిన ఘనమైన చరిత్ర వారిది. అయితే.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్న ఎర్రదండు.. పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేకపోతోంది. ఇప్పటికే షెడ్యూల్ రిలీజ్ అయి.. మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ సైతం వెలువడనుంది. కానీ.. కమ్యూనిస్టులు మాత్రం తాము ఎవరివైపు అనేది ఇంతవరకు స్పష్టతనివ్వలేదు. దాంతో ఆ పార్టీ కార్యకర్తల్లోనూ కన్ఫ్యూజన్ కనిపిస్తోంది. దీనికితోడు సమయం దొరికినప్పుడల్లా జిల్లా సీపీఐ, సీపీఎం నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడుతూనే ఉన్నారు. దాంతో అసలు వీరు కాంగ్రెస్‌తోనే పొత్తులో ఉన్నారా..? లేక విడిపోయారా..? అనే సందిగ్ధం నెలకొంది. అటు జాతీయ స్థాయిలోనూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజ భార్య పోటీకి దిగుతున్నారు. వీటన్నింటి నేపథ్యంలో సీపీఐ నేతలు ఎలాంటి స్ట్రాటజీ తీసుకుంటారా అనేది తెలియకుండా ఉంది. కాంగ్రెస్‌కు పొత్తు ప్రకటిస్తారా..? లేదంటే ఇండిపెండెంట్‌గా తమకు అనుకూలమైన సీట్లలో బరిలోకి దిగుతారా వేచి చూడాలి.

## పొత్తు కొనసాగేనా..?

గత అసెంబ్లీ ఎన్నికల వేళ కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీతో జతకట్టారు. కాంగ్రెస్ కండువాలు మెడలో వేసుకొని మరీ ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేశారు. మెజార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అహర్నిశలు కృషి చేశారు. అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. అయితే.. పొత్తు పొత్తే.. సమస్యలపై నిలదీత.. నిలదీతే అన్నట్లుగా వీరి వ్యవహారం నడుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తయింది. కానీ.. ఎప్పటి నుంచో ఆ ప్రభుత్వంపై కమ్యూనిస్టులు విమర్శనాస్త్రాలు సంధిస్తూ వస్తున్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలపై నిలదీస్తూనే ఉన్నారు. పలుమార్లు ప్రత్యక్ష ఆందోళనలకు సైతం దిగారు. దాంతో ఒకవైపు కాంగ్రెస్ పార్టీ నేతలు వారిపై గుస్సాతో ఉన్నట్లు సమాచారం. పొత్తులో ఉండి ఈ విమర్శలేంటని వారిలో నాటుకుపోయినట్లు తెలిసింది. అయితే.. పొత్తు అంశంపైనే మరో రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో కమ్యూనిస్టులు భేటీ కాబోతున్నట్లు తెలిసింది. ఆ మీటింగుతో క్లారిటీ దొరకవచ్చనే అభిప్రాయం సైతం వ్యక్తమవుతోంది.

## కరీంనగర్ ఎంపీ స్థానంపై ప్రభావం

కమ్యూనిస్టులు పొత్తు నుంచి తప్పుకుంటే.. కాస్తో కూస్తో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపుపై చూపొచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కామ్రేడ్లకు ప్రధానంగా హుస్నాబాద్, హుజూరాబాద్, సిరిసిల్లతోపాటు పలుచోట్ల మంచి పట్టు ఉంది. నిత్యం అక్కడి వారి సమస్యలపై వారు పోరాడుతుండడంతో అక్కడి ప్రజల్లో వీరి పట్ల సానుభూతి ఉంది. చెప్పుకోదగ్గ క్యాడర్ సైతం ఆయా నియోజకవర్గాల్లో ఉంది. అయితే.. ఒకవేళ కాంగ్రెస్ తో పొత్తు లేకుంటే కమ్యూనిస్టులు స్వతంత్రంగా బరిలోకి దిగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తమ పార్టీకి బలం ఉండడంతో.. ఒంటరిగా బరిలోకి దిగి తమసత్తా చాటేందుకు సన్నద్ధం అవుతున్నట్లుగా సమాచారం.

# పతికోసం సతి ప్రచారం



**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** పతి గెలుపు కోసం సతి ఎండను సైతం లెక్క చేయకుండా ఉపాధి హామీ పథకం పనులను చేస్తున్న కూలీల చెంతకు చేరి ప్రచారం చేశారు. మంగళవారం సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దాచారం లక్ష్మీపూర్ వడ్లూరు గ్రామాలలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ గెలుపు కోసం ఆయన సతీమణి బోయినపల్లి మాధవి ఉపాధి హామీ పనులను చేస్తున్న వారి చెంతకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ వినోద్ కుమార్‌ను గెలిపించాలని, అప్పుడే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తేనే తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడతారని తేల్చిచెప్పారు. ఆమె వెంట బెజ్జంకి జడ్పీటీసీ కనగండ్ల కవిత, బెజ్జంకి, బోయినపల్లి ఎంపీపీలు లింగాల నిర్మల, సత్తినేని భాగ్యలత, ముక్కిస తిరుపతి రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, దీటి రాజు, బాలనర్సు, తాడూరు వెంకట్ రెడ్డి, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

## సీనియర్లు దూరం

మాధవి బెజ్జంకి పర్యటించిన సందర్భంగా ఆమె వెంట మండలంలోని రాష్ట్ర నాయకులు కానీ, మాజీ ఎమ్మెల్యే కానీ, మండల స్థాయి నాయకులు కానీ ఎవరూ పాల్గొనలేదు. మండల పార్టీలో ఏం జరుగుతుందో తెలియడం లేదని పలువురు గుసగుసలాడుకున్నారు. మాధవి పర్యటిస్తున్న సమయంలోనే మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మండలంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంటే పలువురు మండలంలోని నాయకులు ఉండటం గమనార్హం.

## కాంగ్రెస్‌లో చేరిక

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్:** ఎంఐఎం మాజీ అధ్యక్షుడు వాజుద్దీన్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

## నా మాట: సీత స్వభావం

శివధనస్సు వంచిన బలవంతుడైన
రామున్ని గుణవంతుడైన రామున్ని,
అయోధ్యకు కాబోయే యువరాజు
పెళ్లాడినందుకు గర్వపడలేదు..
రాణివాసంలో ఉండాల్సిన సీత
రాముడితో వనవాసం వెళ్తే బాధపడలేదు.
భోగభాగ్యాలు అనుభవించే వేల
రామునితో అడవిలో పర్ణశాలలో
నారచీరలతో ఉంటే చింత పడలేదు.
విధిరాత అని తలవంచిందే తప్ప ఎవరిని
నిందించలేదు.
రాముడు ఎక్కడ ఉంటే అక్కడే. అయోధ్య
అదే రాణివాసం. అదే ఉత్తమ భారత స్త్రీల
యొక్క స్వభావం.

- ఎల్లల నిర్మల
పారువెళ్ల, గన్నేరువరం కరీంనగర్



# సౌత్ ఇండియా కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో ప్రతిభ

**తెలంగాణ క్యాపిటల్, సుల్తానాబాద్:** సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు సౌత్ ఇండియా కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 14వ తేదీ ఆదివారం హైదరాబాదులో జరిగిన సౌత్ ఇండియా కరాటే, కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో జి.హర్షవర్ధన్ కట, స్పారింగ్ విభాగంలో బంగారు పథకం సాధించగా, జి.రిషివర్ధన్, ఎం.శ్రీహాన్, పి.అభిరామ్ కట, స్పారింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే వలన మంచి క్రమశిక్షణ ఏర్పడుతుందని, తమ స్వీయ రక్షణకు, ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.



# నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్ల పరిశీలన

**తెలంగాణ క్యాపిటల్, రామగుండం:** నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు మూడంచెల పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేపట్టినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పెద్దపల్లి డీసీపీ చేతనతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్స్ ప్రక్రియ పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను, ఎంట్రెన్స్, ఎగ్జిట్ దారులు, పార్కింగ్ ఏర్పాటు, మీడియా పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు జరుగుతుందని, రిటర్నింగ్ అధికారి చాంబర్‌ను సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, దాని కోసం సెంట్రల్ ఫోర్స్, అర్మ్‌డ్, సివిల్ ఫోర్స్‌తో మూడంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అవసరమైన అన్ని భద్రత చర్యలు ఏర్పాటు చేశామన్నారు. రిటర్నింగ్ అధికారి చాంబర్ నుండి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ జి.కృష్ణ, సీఐ కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

TELANGANA CAPITAL
తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత
www.telanganacapitalnews.com

GENERAL NEWS





# నేడు రామయ్య కల్యాణం

- జిల్లావ్యాప్తంగా రామాలయాలు ముస్తాబు
- రామాజీపేట ఆలయం మరింత ప్రసిద్ధి
- నలుమూలల నుండి రానున్న భక్తులు

**(తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట)**

శ్రీ సీతారాముల కల్యాణం అంతటా కన్నులపండువగా జరుపుకుంటారు. సీతారాముల కల్యాణాన్ని భక్తులు లోక కల్యాణంగా భావిస్తుంటారు. మిథిలా రాజ్యపాలకుడు జనక మహరాజు తనయ సీతాదేవి. శ్రీరాముడు శివ ధనస్సు విరిచి సీతను వివాహమాడుతాడు. వారి కల్యాణం ఎంతో ఘనంగా జరుగుతుంది. అందుకే త్రేతాయుగం నాటి రామాయణాన్ని వాల్మీకి రాసి లక్ష వసంతాలు అవుతున్నా ఇప్పటికి సీతారాముల కల్యాణాన్ని భక్తులు తమ ఇంటిలో వివాహ వేడుకలా భావిస్తారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ సూత్రధారణ, తలంబ్రాలు, పట్టు వస్త్రాల సమర్పణ.. తదితర ఘట్టాలు అంగరంగవైభంగా నిర్వహిస్తారు. మానవాళికి ఆదర్శ దంపతులైన సీతారాముల కల్యాణం చూసినా ఎంతో పుణ్యమని భక్తులు విశ్వసిస్తారు. అందులోనూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రామాజీపేటలోని శ్రీరామ క్షేత్రం మరింత ప్రసిద్ధి గాంచింది. నేడు ఆలయంలో అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించనున్నారు. ఈ వేడుకకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు.

## ఆలయానికి ఎంతో చరిత్ర..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రామాజీపేటలో బుధవారం శ్రీరామ క్షేత్రం ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయం 1961లో విధమౌళి శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయం నిర్మించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రామాజీపేట రామాలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ జరిగే వేడుకలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాజకీయ నాయకులు, హనుమాన్ మాల ధారణ భక్తులు, ప్రజలు, ఇక్కడ జరిగే శ్రీరామ కళ్యాణోత్సవాలకు తరలివస్తారు. బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీరామ జన్మోత్సవం తదుపరి 12 గంటలకు సీతారామ కళ్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక పురోహితులు రుక్మాంబట్ల సీతారామ శర్మ, శశాంక్, రామశర్మ పేర్కొన్నారు. ఇక్కడ జరిగే సీతారామ కళ్యాణ వేడుకలకు మాజీ రాజ్యసభ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు ఏటా వస్తుంటారు. తనకు తీరిక దొరికిన సమయాల్లో కూడా ఈ దేవాలయం వద్దకు వచ్చి పూజలు చేస్తుంటారు. ఈ ఆలయ ప్రదాత రుక్మాంబట్ల విధు మౌళి శాస్త్రి రచించిన తందనాన రామాయణం ఎంతో ప్రసిద్ధిగాంచింది. అంతేకాకుండా గేయ రామాయణం కూడా ఈ ప్రాంతంలో పురోహితులు రచించింది. తందనాన రామాయణం విధి మౌళి శాస్త్రి గ్రామాలలో చెక్కభజన కార్యక్రమాల రూపంలో గీతాలాపన గావించేవారు. పురోహితులు మాట్లాడుతూ సంతాన ప్రాప్తి కోసం, గ్రహ సంబంధ లోపాలున్నవారు, కళ్యాణం కాని వారు, ఈ ఆలయంలో 108 ప్రదక్షిణలు చేస్తే వారి సమస్యలు దూరం అవుతాయని అంటున్నారు. 11 రోజులపాటు లక్ష రుద్రయాగం 1,000 మంది బ్రాహ్మణులతో గతంలో చేసినట్టు పేర్కొన్నారు.

## రెండో భద్రాద్రిగా పేరు..

రామాజీపేట శ్రీ రామాలయానికి రెండో భద్రాద్రిగా పేరుంది. కళ్యాణ వేడుకలు సైతం అదే స్థాయిలో నిర్వహిస్తామని పురోహితులు చెప్తున్నారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీరామాలయ గుడి దగ్గరలో ఉన్న అంజనా కొండపై 50 అడుగుల ఎత్తుతో భక్త హనుమాన్ విగ్రహం 11 లక్షల నిధులతో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు ఏర్పాటు చేయించారని పురోహితులు సీతారామ శర్మ పేర్కొన్నారు. ఈ రోడ్డున గుండా వెళ్లే వారికి ఎత్తైన ఆంజనేయ విగ్రహం కనువిందు చేస్తుంది. విద్యార్థులు, సందర్శకులు, కొండపైన ఉన్న ఆంజనేయ విగ్రహాన్ని చూడడానికి వెళుతుంటారు.



# పేద కుటుంబంలో పుట్టి.. సివిల్స్ కొట్టి..

**తెలంగాణ క్యాపిటల్, గంగాధర:** ఓ వైపు ఫ్యామిలీని వెంటాడుతున్న కష్టాలు.. మరోవైపు సివిల్స్ సాధించాలని గోల్.. లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగాడు. ఫైనల్‌గా సివిల్స్ సాధించాడు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల కాంతయ్య మహారాష్ట్రలోని భీవండిలో పవర్ లూమ్స్ కార్మికునిగా పనిచేస్తుండగా క్యాన్సర్ బారిన పడి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. అనారోగ్యంతో 2016లో చనిపోయాడు. ఇక అప్పటి నుంచి పిల్లలను చదివించుకుంటూ తల్లి లక్ష్మీ జీవనం సాగిస్తున్నారు. బీడీలు చుడుతూ వచ్చిన ఆదాయంతో అటు కటుంబాన్ని పోషిస్తూ.. ఇటు పిల్లలను చదివించారు. తల్లి కష్టం చూసిన ఆ ఇంట పుట్టిన బిడ్డలు కూడా కష్టాలకు ఫుల్ స్టాప్ పెట్టాలన్న లక్ష్యంతోనే చదువులో రాణించారు. కూతురు స్రవంతి బాసర ట్రిపుల్ ఐటీలో చదివి మిషన్ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం చేస్తున్నారు. కొడుకు సాయికిరణ్ కుటుంబ స్థితిగతుల దృష్ట్యా జాబ్ చేస్తూనే సివిల్స్ ప్రిపేర్ అయ్యాడు. తొలిసారి ప్రయత్నం చేశాడు. కానీ.. అది సక్సెస్ కాలేదు. దాంతో ఉద్యోగం వదిలేసి సివిల్స్ ప్రిపేర్ కావాలని ఆలోచనకు వచ్చాడు. కానీ.. సివిల్స్ ప్రిపరేషన్ కోసం ఉన్న ఉద్యోగం వదులుకుంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవనుకొని ఉద్యోగం చేస్తూనే కోచింగ్ తీసుకున్నాడు. అదే పంథాతో సాయి కిరణ్ రెండో ప్రయత్నంలోనే యూపీఎస్సీ 27వ ర్యాంకు సాధించాడు.




# పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

**నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్**

**పలు సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమీక్ష**

**(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్)**



నగర ప్రజలకు ఇబ్బందులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సూచించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మంగళవారం పలు సెక్షన్ల ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఆస్తిపన్నుల వసూలు, పెండింగ్ ట్రేడ్ లైసెన్స్ లు, పెండింగ్ కోర్టు కేసులు, ఆస్తిపన్ను 5శాతం రిబేట్ తదితర అంశాలపై అధికారులు సిబ్బందితో సుదీర్ఘంగా చర్చించారు. పలు సలహాలు, సూచనలు చేస్తూ.. అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. లీకేజీలను అరికట్టాలని.. నీటి సరఫరా సమయంలో సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. సమయం ప్రకారం ప్రజలకు తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో ప్రజలకు నీటి అవసరాలు అధికంగా ఉంటాయని, రిజర్వాయర్లను ఫిల్లింగ్ చేసుకొని.. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిల్ కలెక్టర్లు టార్గెట్ ప్రకారం ఆస్తిపన్నులు వసూలు చేయాలన్నారు. నగరంలో వ్యాపారం చేసే షాపుల నుండి ట్రేడ్ లైసెన్స్ కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలన్నారు. నగరంలో ప్లాస్టిక్ వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టాలని.. ప్లాస్టిక్ వాడే షాపులపై తనిఖీలు చేయాలన్నారు. అంతేకాకుండా నగరపాలక సంస్థ కార్యకలాపాలను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ స్వరూపరాణీ, ఈఈలు యాదగిరి, మహేందర్, డీసీపీ సుభాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్తాబైన మహాశక్తి దేవాలయం



**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్:** కరీంనగర్ పట్టణంలోని శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్ల మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం సీతారామచంద్రుల కళ్యాణ మహోత్సవానికి ముస్తాబైంది. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి దివ్య ఆశీస్సులతో, వేద పండితుల కళ్యాణమంత్రోత్సవాల నడుమ బుధవారం రాములోరి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 500 సంవత్సరాల హిందువుల కళ నెరవేరి నేడు అయోధ్యలో కొలువుదీరిన ఆ అయోధ్య రాముడి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా శ్రీ మహాశక్తి ఆలయంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దేవాలయంలో ప్రత్యేక కళ్యాణ వేదిక ఏర్పాటు చేసి, వాటికి పూలతో అలంకరించారు. వేసవి అయినందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కూలర్లు ఏర్పాటు చేసి, మజ్జిగ కూడా అందించనున్నారు. కళ్యాణానికి హాజరయ్యే భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని, ప్రముఖ కళాకారులు కెబి శర్మ ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉన్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కళ్యాణ వేడుకల్లో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు.

## అంతర్గత విషయాలను బహిర్గతం చేస్తే వేటు

**జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పడాల రాహుల్**



**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్:** యూత్ కాంగ్రెస్ శ్రేణులు జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వాన్ని గానీ, పార్టీ అంతర్గత విషయాల పట్ల గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సోషల్ మీడియా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా అవాస్తవాలు ప్రచారం చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పడాల రాహుల్ హెచ్చరించారు. యువజన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ఐకమత్యంగా పనిచేయాలని, రాష్ట్ర కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ మండల స్థాయిలో, గ్రామస్థాయిలో, స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకొని బిజెపి, బిఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ చూపిన చిత్తశుద్ధిని, ఈ దేశ అభివృద్ధి కోసం, దేశ ప్రజల సమైక్యత కోసం కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయాలని సూచించారు.

## ఇసుక డంపు స్వాధీనం

**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని గాగిల్లాపూర్ శివారు ప్రాంతంలో సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు మరియు బెజ్జంకి పోలీసులు కలిసి 200 టన్నుల ఇసుక డంపును మంగళవారం గుర్తించి స్వాధీన పరుచుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా, డంపూ నిర్వహిస్తున్నారని ఖచ్చితమైన సమాచారం రావడంతో ఈ దాడులను నిర్వహించినట్లు బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామన్నారు.



## గంజాయి విక్రేతల అరెస్ట్



**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** మండల కేంద్రంలో గంజాయి విక్రేతలను సోమవారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని మహారాజుల కాలనీ వద్ద మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించడంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న సంచులను పరిశీలించగా అందులో 130 గ్రాముల గంజాయి లభించినట్టు ఎస్సై ఎల్ రాజు గౌడ్ తెలిపారు. గంజాయి ఇతరులకు అమ్మడానికి కరీంనగర్ కు చెందిన కృష్ణంరాజు భరత్ వినాయక్ (24) బిహార్ రాష్ట్రానికి చెందిన భూపేంద్ర కుమార్ (22) ప్రస్తుతం కరీంనగర్‌లో ఉంటున్నాడు. వీరిద్దరూ గంజాయి విక్రయించడానికి మండల కేంద్రానికి వచ్చినట్టు తెలిపారు. ఇల్లంతకుంట ఎస్సై తమ పోలీసు సిబ్బందితో నిందితులను సోమవారం సాయంత్రం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. గంజాయి విక్రేతలను పట్టుకున్న ఎస్సై రాజు గౌడ్, పోలీసు సిబ్బందిని రూరల్ సీఐ సదన్ కుమార్ అభినందించారు.



## ఆంజనేయుడి అనుగ్రహంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్**

**అగ్రహారం హనుమాన్ ఆలయంలో పూజలు**

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్:** ఆంజనేయుడి అనుగ్రహంతో రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన అగ్రహారంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయుడి అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా కురవాలన్నారు. హారతి కార్యక్రమంలో పాల్గొని అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దీక్షాపరులతో కలిసి హనుమాన్ పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బొల్లి రామ్మోహన్, డాక్టర్ అమిత్, అజిత్, జక్కుల నాగరాజు యాదవ్, సాయికృష్ణ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి వృద్ధురాలి మృతి

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** గాలిపెల్లి గ్రామానికి చెందిన సావణ పెల్లి (నీరటి) పోశవ్వ (68) మంగళవారం ఉదయం వ్యవసాయ బావిలో పడి మరణించింది. మృతురాలికి కొడుకు, ఇద్దరు బిడ్డలు కాగా కొడుకు 30 సంవత్సరాల క్రితమే మరణించినట్టు గ్రామస్తుల ద్వారా తెలిసింది. వృద్ధాప్యంలో ఉన్న భార్యాభర్తలిద్దరే ఇంటిలో ఉంటున్నారు. మంగళవారం ఉదయం కనిపించకపోయే సరికి వెతుకులాడగా బావిలో చీర కనిపించింది. దాంతో బావిలోని నీటిని తోడివేసి మృతురాలు పోషవ్వను బయటకు తీశారు. ఎస్సై రాజు గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

TELANGANA CAPITAL
తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత
www.telanganacapitalnews.com

GENERAL NEWS



## నిరుపేదలకు ఉపాధి కల్పించాలి

**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** నిరుపేదలు రాబోయే వేసవికాలంలో పనులు లేకుండా ఉండరాదని, వారికి పనులను కల్పించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సహాయకులపై ఉందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవ్ ఆర్య స్పష్టం చేశారు. ఆయన మంగళవారం బెజ్జంకిలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిరుపేదలు ఇంటి వద్ద ఉండకుండా అడిగిన వారందరికీ ఉపాధి కల్పించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ , సిద్దిపేట డివిజనల్ పంచాయతీ అధికారులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మప్ప, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఆత్మహత్య

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండలం ఎర్రవర్సుపల్లి గ్రామానికి చెందిన కంకటి స్వామి (45) సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మృతునికి రూ.23 లక్షల అప్పు ఉందని, అప్పు తీర్చడానికి తనకున్న వ్యవసాయ పొలం, ఇల్లు, అమ్మడానికి ప్రయత్నిస్తే అతని తమ్ముడు ప్రభాకర్ అడ్డు తగిలాడు. దాంతో మనస్థాపానికి గురై స్వామి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా అశోక్

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్ష ఎన్నికలలో వెల్జిపురం గ్రామానికి చెందిన పందిళ్ళ అశోక్ ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి కోసం నలుగురు మెంబర్లు పోటీపడగా పందిళ్ళ అశోక్ ఎక్కువ ఓట్లు సాధించి అధ్యక్షునిగా గెలుపొందారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి పదవికి కూడా పోటీ జరగగా అంతగిరి గ్రామానికి చెందిన చింతకుంట మల్లేశం గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా పందిళ్ళ లక్ష్మీరాజం, సహాయ ఉపాధ్యక్షులుగా జనగాం మొండయ్య, సహాయ కార్యదర్శిగా ఎం.బాలయ్య, ట్రెజరర్ గా చింతకుంట శ్రీనివాస్, డైరెక్టర్లుగా కమలాకర్, బత్తిని ప్రభాకర్, మధు, గడ్డం మల్లేశం, సమ్మెట వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని వైశ్య భవన్ లో సభ్యులందరూ సమావేశమై మంగళవారం ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా ఎన్నికైన పందిళ్ళ అశోక్‌ను పలువురు అభినందించారు.

# ఎదుర్కోళ్ల మహోత్సవం

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్:** శ్రీ సీతారామ చంద్రస్వామి ఆశీస్సులు అందరికి ఉండాలని, లోక కళ్యాణార్థమై వివిధ పూజా కార్యక్రమాలను చేపట్టి ఆటంకాలు లేని జీవితాన్ని అనుభవించాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కోరారు. స్థానిక క్రిస్టియన్ కాలనీ వారి స్వగృహంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన ఎదుర్కోళ్ల మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రాముడిని ఆదర్శంగా తీసుకొని ఉత్తమంగా జీవించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయం చేయాలని, ఎలాంటి స్వార్థం పెంపొందించవద్దని కోరారు. నేటి పోటీ ప్రపంచంలో పోటీతత్వం పెరగడంతో చాలా మంది వారి తల్లిదండ్రులను విస్మరిస్తున్నారని, ఎటువంటి శ్రద్ధ వహించకపోవడం చాలా శోచనీయమని, విచారకరమని చెప్పారు. రాముడిని ప్రపంచంలో వివిధ



రూపాలలో కొలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి కోదండరామాలయం కార్యకర్తలు, రుత్విక్కులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలపించిన పలు ఎదుర్కోలు పాటలు, రాముని కళ్యాణ ఘట్టం వివరణ చాలా స్ఫూర్తినింపింది.

## హైదరాబాద్‌కు తీసుకురండి.. మెరుగైన వైద్యం చేయిద్దాం

**తెలంగాణ క్యాపిటల్, రామగిరి:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జంగిలి అంజిని హైదరాబాద్‌కు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కుటుంబ సభ్యులకు సూచించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జంగిలి కనకయ్య తమ్ముని కుమారుడు కాంగ్రెస్ కార్యకర్త అయిన జంగిలి అంజి ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడిని మంత్రి పరామర్శించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్ లో చికిత్స చేయించారు. అతను కోమా నుండి పూర్తిగా కోలుకోకపోవడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు. ప్రతీ కార్యకర్తకు తాను అండగా ఉంటానని.. ఏ ఆపద వచ్చినా అర్ధరాత్రి అయినా తనతోపాటు తన



సోదరుడు శీను బాబు అందుబాటులో ఉండి సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు, తాజా మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, పిడుగు శంకర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎం ఏ రఫిక్, మతిన్ ఖాన్, వడ్లకొండ మల్లేష్, జంగిలి గట్టయ్య, జంగిలి కృష్ణ తదితరులు ఉన్నారు.

# మహనీయుల జీవితాలు ఆదర్శప్రాయం

**ఆచార్య మల్లేశ్ సంకాసాల**

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్:** శాతవాహన విశ్వవిద్యాలయంలో మంగళవారం మహనీయుల జయంతోత్సవాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ లైబ్రరీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సభా అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశమంతా మహనీయుల జయంతులను జరుపుకోవాలని, వారి సేవలను గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య మల్లేశ్ సంకశాల మాట్లాడుతూ మహనీయుల జయంతులను జరుపుకోవడం ద్వారా వారి ఆలోచనా విధానాలను మన జీవితానికి అన్వయించుకొని సమాజంలోని అసమానతలను నిర్మూలించాలని సమసమాజ నిర్మాణానికి మార్గాలు కల్పించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆచార్య అడప సత్యనారాయణ ఉస్మానియా విశ్వవిద్యాలయం మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో అత్యంత ప్రభావశీలి, దార్శనికుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన ఎదుర్కొన్న పరిస్థితులు, ఆయన భారతదేశానికి చూపిన మార్గదర్శనాన్ని ముందుకు తీసుకువెళ్ళడమే మహనీయులకు మనమిచ్చే గౌరవం అని అన్నారు. ఆచార్య గోన నాయక్ హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వడమే ధ్యేయంగా పూలే దంపతులు జీవించారని, మహిళలకు విద్య అందించాలని అకుంఠిత దీక్షతో పనిచేశారని, మహిళా సాధికారత కోసం పోరాటం చేశారన్నారు. ఎస్సీ ఎస్టీ సెల్




డైరెక్టర్ డాక్టర్ కే.పద్మావతి మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లతో దేశం ముందుకు వెళుతుందని అందరికీ సమాన అవకాశాలు రిజర్వేషన్ల వల్లనే వచ్చాయని అన్నారు. జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ మహనీయులంతా దేశ ప్రగతి కోసం సామాజిక న్యాయం కోసం అనేక రుగ్మతలను రూపుమాపడం కోసం ముందుండి సేవ చేశారని వారిని విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకొని కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. అనంతరం ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం సరసిజ, ఆర్ట్స్, సైన్స్ కామర్స్ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కే తిరుపతి, డి విజయ ప్రకాష్, డి విజయ్ కుమార్, శాతవాహన విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ క్యాపిటల్ పేపర్‌లో వార్తల కోసం ఈ నంబర్‌లో సంప్రదించగలరు : 92949 92992